## భక్త జనసందోహంతో పులకించిన మన్యంకొండ..

**- జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు**

**- కొనసాగుతున్న శాంతిహోమం**



మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**దేవరకద్ర రూరల్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** జిల్లాలోని మన్యకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం సోమవారం భక్తజనసందోహంతో పులకించిపోయింది. శ్రావణమాసం సందర్భంగా విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు మన్యంకొండకు అదికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం ముందున్న కోనేరులో పుణ్యస్నానాలు అచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అలాగే దేవస్థానం అనుబంద దేవాలయమైన శివాలయం,దిగువకొండ వద్దనున్న శ్రీ అలివేలు మంగతాయారు దేవస్తానంలో కూడ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ్మాస్వామి దేవస్థానంలో కూడ భక్తులు పూజలు నిర్వహించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని కొంత మంది భక్తులు వ్రతాలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. మరికొంతమంది తలనీలాలు సమర్పించారు. జిల్లా నలు మూలల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో మన్యంకొండ భక్తులతో కిటకిటలాగింది. ఈ సందర్బంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. వివిధ రకరకాల పూలు,అభరణాలతో స్వామి వారికి అలంకరించారు. దీంతో అలంకరణలో స్వామి వారు భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్తానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రాయకృష్ణ,ఈఓ పురేందర్‌కుమార్,పర్యవేక్షకుడు నిత్యానందచారి,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

**భక్తులకు అన్నదానం...** విశేష మాసాన్ని పురస్కరించుకొని మన్యంకొండలో స్వామివారి సన్నిధిలో లక్ష్మీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు యం.వెంకటసుబ్బయ్య అధ్వర్యంలో సేవాభారతి ద్వారా ఉదయం నుండి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానానికి వచ్చిన కొన్ని వేల మంది భక్తులు పాల్గొని బోజనాలు చేశారు.

**కొనసాగుతున్న శాంతిహోమం...** ఈ సందర్బంగా శాంతిహోమం కార్యక్రమాన్ని కూడ పురోహితులు సాంప్రదాయరీతిలో నిర్వహించారు. సెప్టెంబరు 1 వరకు దాదాపు నెల రోజుల పాటు దేవస్థానంలో ఈ పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్బంగా విశేష మాసాన్ని పురస్కరించుకొని ప్రతిరోజు దేవస్థానంలో శాంతిహోమం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే బుధ,గురు,శుక్రవారాలలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించనున్నారు. ప్రతి శనివారం స్వామివారి శేషవాహనసేవ నిర్వహిస్తారు.

## సాంస్కృతి, సంప్రదాయాలకు నిలయం తెలంగాణ రాష్ట్రం



బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, ఆగస్టు 22, ప్రభాతవార్త:**సాంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా తెలంగాణ రాష్ట్రం విరజిల్లుతుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో సోమవారం గొర్రె కాపరుల సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ కొంగళ్ళ జయమ్మ, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యలతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోనిర్వహిస్తున్న బీరప్ప బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆడి పాడారు. బీరప్ప దేవాలయం వద్ద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని పండుగలకు ప్రాముఖ్యతనిస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రాధకిషన్, మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ధరూర్ మండలంలోకి చేరిన వైఎస్ షర్మిల పాదయాత్ర



ప్రజలతో మాట్లాడుతున్న షర్మిల



జూరాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న వైఎస్ షర్మిల

**ధరూర్,ఆగస్టు22 ప్రభాతవార్త:**జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో జూరాల మీదుగా ప్రజా ప్రస్థానంలో భాగంగా వైఎస్ షర్మిల పాదయాత్ర జూరాల సందర్శించి చింతరేళ్ల గ్రామం లోకి అడుగుపెట్టింది. మాట ముచ్చట కార్యక్రమంలో భాగంగా వైఎస్‌షర్మిల మాట్లాడుతూ రాజ శేఖర్‌రెడ్డి బిడ్డ 1500కి.మీ. పాదయాత్ర ముగించుకుని మీగ్రామానికి వచ్చింది గుండె నిండా అభి మానంతో రాజ శేఖర్‌రెడ్డి బిడ్డకు స్వాగతం పలికినందుకు అక్క, చెల్లి,అన్న,తమ్ముళ్లకు అందరికి నమస్కారాలు తెలియజేశారు. పాలకులు చెబుతున్న మాట తెలంగాణలో అసలే సమస్యలు లేవని కెసిఆర్, టిఆర్ఎస్ పార్టీ చెబుతున్న మాట ప్రజలకు పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని చెబుతున్నారని అన్నారు.వారి సంక్షేమపథకాలు పాదయాత్ర ద్వారా తెలుస్తున్నాయని ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వైఎస్సార్ హయాంలో ప్రతి పథకం అద్భుతంగా అమలు చేసి చూపించారని, వ్యవసాయం పండగ లా ఉండేదని పెట్టుబడి తగ్గించి రాబడి పెంచారని, ఉచిత విద్యుత్ ఆలోచన చేసిన మొట్టమొదటి నాయకుడు వైఎస్సార్ అని చంద్రబాబు కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవాలని ఎగతాళి చేసినా ఉచిత కరెంటు ఇచ్చి చూపించారని అన్నారు. ఫీజు రియాంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకం ఇలా ప్రతి పథకం ప్రత్యేకమైందని, వైఎస్సార్ ఐదేళ్ల పరిపాలనలో 46 లక్షల మంది పేదలకు పక్కాఇళ్లు కట్టించి ఇచ్చారన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌ది అన్నారు. ఉద్యోగాలు లేక వందల మంది నిరుద్యోగులు చనిపోతున్నారని రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఇప్పటి వరకు 17 వేలకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని కెసిఆర్ చేతుల్లో పెండితే 4 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. బంగారు తెలంగాణను కాస్త బార్ల తెలంగాణ, బీర్ల తెలంగాణగా మార్చారని ఎద్దేవా చేశారు. హైద్రాబాద్ నడిబొడ్డున మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే చర్యలు లేవని, నిందితులను జైల్లో పెట్టి బిర్యానీలు పెట్టి మేపారని అన్నారు. అధికార పార్టీ పిల్లలని తెలిసినా ఎవరిపై చర్యలు లేవని, ఎవరైనా ప్రశ్నిస్తే వారి పేర్లు రాసుకుని మరీ వేధిస్తున్నారని అన్నారు. కెసిఆర్‌కు ప్రజలంటే కేవలం ఓట్లు మాత్రమేనని ప్రజల సంక్షేమం అంటే కెసిఆర్‌కు తెలియదని అన్నారు. వైఎస్సార్ సుపరిపాలన మళ్లీ తీసుకువచ్చేందుకు పార్టీ పెట్టామని వైఎస్సార్ ప్రతి పథకాన్ని అమలు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## టీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఆర్థిక చేయూత ..

**పేద ముస్లిం అమ్మాయిల పెళ్లి కానుక**

**షాదీ ముబారక్ పథకాన్ని అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం..**

**వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి**

**కృతజ్ఞతలు వనపర్తి జిల్లా వక్ఫ్ ఆస్థుల రక్షణ కమిటీ..**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వక్ఫ్ ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు

**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** సోమవారం వనపర్తి పట్టణంలోని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో వక్ఫ్ ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ముస్లిం అమ్మాయిల పెళ్లి కానుక షాదీ ముబారక్ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇట్టి పథకం ద్వారా తెలంగాణ ప్రాంతం ముస్లిం అమ్మాయిలకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 నుండి నేటి వరకు ముస్లిం ల సంక్షేమం పై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. మంత్రి కృషి తో వనపర్తి జిల్లాకు 1123 మంది షాదీ ముబారక్ లబ్దిదారులు అలాగే వనపర్తి నియోజకవర్గానికి సంబంధించి 593 మంది షాదీముబారక్ లబ్దిదారులకు లబ్ది చెందిందని అన్నారు. ఈ సంవత్సరం వనపర్తి జిల్లాకు సంబంధించిన 161 మంది దరఖాస్తులకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరింది. త్వరలో అధికారులు చెక్కులను దరఖాస్తులను అదజేయనున్నారు. వనపర్తి నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ మంత్రి నాయకత్వంలో ముస్లింల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉంటూ అలాగే మంత్రి చొరవతో వారి దూరదృష్టితో నియోజకవర్గంలో విద్యాలయాల నిర్మాణం, మసీదులకు దర్గాలకు ఈద్గాలకు నిధుల కేటాయింపు ముస్లింలపై మంత్రి కి ఉన్న ప్రత్యేక శ్రద్దకు నిదర్శనం అని అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యంతో ముస్లింల సంక్షేమ రంగం సంక్షోభంలో పడితే మంత్రి ప్రత్యేక చొరవతో ముస్లింల సంక్షేమ రంగం పరుగులు తీస్తోందని అన్నారు. ముస్లింలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్న గతపాలకులు ముస్లింల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. మైనార్టీ సమాజం యొక్క భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ఎంతో శ్రద్దతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రికి ఈ సందర్బంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మైసన్, అబ్దుల్ అజీజ్ ఖాన్, స్టార్ రహీం, జోహెబ్ హుస్సేన్, మలిదశ తెలంగాణ ఉద్యమ కారుడు లతీఫ్, హైదర్, మైనార్టీ యూత్ అధ్యక్షుడు ఖాదర్, ఇన్వేటర్ పాషా, అత్తర్, జాకీర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు



నూతన కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**గద్వాల,ఆగస్టు 22 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, అదనపు కలెక్టర్ శ్రీహర్షలు సందర్శించి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులను అన్ని వసతులతో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎంపిపిలు విజయ్, రాజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## కొత్త రోడ్లతో.. ట్రాఫిక్ సమస్యకు చెక్..!

**- కొత్త రోడ్లతో మరింత కనెక్టివిటి..**

**- జాతీయ రహదారులకు అడ్డాగా మహబూబ్‌నగర్**

**- ఎనుగొండ - బైపాస్ లింక్ రోడ్డు పనుల పరిశీలన**

**- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**



బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 22 ప్రభాతవార్త :** నూతన రోడ్లు ఏర్పాటు చేసి పట్టణంలో కనెక్టివిటిని మరింతగా పెంచుతామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన బైపాస్ వల్ల ఇప్పటికే రవాణా సదుపాయం ఎంతో మెరుగైందని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ ఎనుగొండలోని రాంరెడ్డి కంటి ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి నుంచి బైపాస్ రోడ్డు వరకు జరుగుతున్న రహదారి పనులను డిసిసిబి వైస్ ఛైర్మన్ కోరమోని వెంకటయ్యతో కలిసి మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్ల- మహబూబ్‌నగర్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరించడంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ చెప్పగలిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్‌విఎస్ నుంచి భూత్పూర్ రోడ్డు వరకు ఉన్న బైపాస్ రోడ్డుకు జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీల నుంచి లింక్ రోడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తామన్నారు. భూత్పూర్ రోడ్డు నుంచి కొత్తగా నిర్మితమయ్యే కోస్గి బైపాస్ వల్ల పట్టణంలోని అన్ని ప్రాంతాలకు కనెక్టివిటి మరింతగా పెరుగుతుందని ఆయన తెలిపారు. పట్టణంలో ఎక్కడికక్కడ అంతర్గత రహదారులు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. చించోలి, అమ్రాబాద్ జాతీయ రహదారుల నిర్మాణంతో జిల్లా కేంద్రం జాతీయ రహదారులకు అడ్డగా మారనుందని మంత్రి తెలిపారు.

**మహనీయుడు రాజా బహదూర్..**



రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కులమతాలకతీతంగా జాతికోసం పాటుపడిన గొప్పవ్యక్తి రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వెంకట్రామారెడ్డి 154వ జయంతి వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్, పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న ఆ మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి మంత్రి ఘనంగా నివాళులర్పించారు. వెంకట్రామారెడ్డి మహబూబ్‌నగర్‌లో పుట్టడం జిల్లా వాసిగా ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఆయన ఒకకులం, మతానికి సంబంధించిన వ్యక్తి కాదని, జాతికోసం పాటుపడిన గొప్ప వ్యక్తని, ఆయన అందరివాడని తెలిపారు. హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి అనేకమంది రైతు కుటుంబాల, పేద విద్యార్థులకు విద్యనందించేందుకు కృషి చేశారన్నారు. ఆయన స్పూర్తితోనే మిగతావాళ్లు కూడా వసతి గృహాలు, భవన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అంబేద్కర్, చాకలి ఐలమ్మ, సర్దార్ సరా ్వయి పాపన్న, పూలే, పుచ్చలపల్లి సుందరామయ్య లాంటి మహనీయులు సమ సమాజం కోసం పాటుపడ్డారన్నారు. వారి ఆశయాలు, భావజాలంతో పేదల కోసం సహాయపడడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజం కోసం పాటుపడిన మహనీయులను కొన్ని కులాలు, మతాలకే పరిమితం చేయాలని చూడడం బాధాకరమని ఈ సందర్బంగా మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల జయంతి, వర్థంతి వేడుకల్లో కొన్ని కులాలు, మతాలకు సంబంధించిన వ్యక్తులే కాకుండా అందరు వచ్చి నివాళులర్పించాలని మంత్రి కోరారు. జిల్లాకు చెందిన పోరాటయోధుడు సురవరం ప్రతాపరెడ్డి కుటుంబాన్ని స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్బంగా సన్మానం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, అనంతరెడ్డి, రెడ్డి సేవాసమితి నాయకులు ఇంద్రసేనారెడ్డి, పొద్దుటూరి ఎల్లారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

## వ్యాయామంతోనే ఆరోగ్యం..

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి




విశ్రాంత సైనికుడును అభినందిస్తున్న మంత్రి, జడ్పీ చైర్మెన్



వ్యాయామం చేస్తున్న విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్న మంత్రి

వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 22 ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యం వ్యాయామంతోనే ఆరోగ్యం నిత్యం దానిని ఆచరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి జూనియర్ కళాశాల మైదానంలో విశ్రాంతి సైనికుడు శివశంకర్ రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను ప్రారంభించి శివశంకర్ ను అభినందించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వ్యాయామం పట్ల శ్రద్ధ లోపించిందని సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల మోజులో యువత, పిల్లలు, పెద్దలు వ్యాయామానికి దూరంగా ఉంటున్నారని దాని మూలంగా అనవసర ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వ్యాయామం చేయడం మూలంగా ఆరోగ్య సమస్యలు ఉండవని యువత, విద్యార్థులు ఆటల మీద దృష్టి పెట్టి తమకు నచ్చిన ఆటలు నిత్యం సాధన చేయాలని ఆటల మీద దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లను యువత వినియోగించుకొని దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ ఆర్ లోక్‌నాథ్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ పలుస రమేష్ గౌడ్, కౌన్సిలర్ బండారు కృష్ణ, టీఆర్ఎస్ నాయకులు ఆవుల రమేష్, రహీం, తోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు..!!

**- పక్షం రోజుల పాటు మురిసిన జెండాలు..**

**- ఫ్రీడమ్ రన్,ఏకకాల జాతీయగీతాలాపనలు..**

**- రక్తదాన శిబిరాలు..**

**హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాలు..**



ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ తదితరులు (ఫైల్)

**భూత్పూర్,ఆగస్టు 22,ప్రభాతవార్త :** 75వ భారత స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పక్షం రోజుల వజ్రోత్సవాలు సోమవారం ముగిసాయి.ప్రధాని మోదీ,సీఎం కేసీఆర్ పిలుపుమేరకు ఈ నెల 8నుంచి 22వరకు పక్ష ం రోజుల పాటు వజ్రోత్సవాలు నిర్వహించారు.తొలిరోజు ఇంటింటికి జెండాల పంపిణీ,మరుసటి రోజు వజ్రోత్సవాల ర్యాలీ,మూడో రోజు ఫ్రీడమ్ రన్,నాల్గోరోజు మొక్కల నాటే కార్యక్రమం,ఐదో రోజు రక్తదాన శిబిరాలు,ఆరో రోజు సామూహిక సమావేశాలు, ఏడో రోజు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు,ఎనిమిదోరోజు ఫ్రీడమ్ కప్ పేరిట క్రీడల నిర్వహణ, తొమ్మిదో రోజు ఆసుపత్రులు,ఆనాథశరణాలయాలలో పండ్లు పంపిణీ,జాతీయ సమైక్యతను చాటే దిశగా సమైక్యతా రక్షాబంధన్, కార్యక్రమం,దేశభక్తి,జాతీయ సమైక్యతను చాటే ముగ్గుల పోటీలు,ఆయా పాలకమండళ్లలో వజ్రోత్సవాల ప్రత్యేక సమావేశాలు,చివరి రోజైన సోమవారం 22న జెండాల వితరణ,ముగింపు సమావేశాలతో పాటు వజ్రోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా ముగించారు. ఈ క్రమంలో భాగంగా భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో మున్సిపల్,ఎంపిపి,మండల రెవెన్యూ అధికారులు, సిబ్బందితో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్,తహసిల్దార్ చెన్నకిష్టన్న,కమిషనర్ నూరుల్ నజీబ్‌లతో పాటు జిల్లా మత్స్య సహకార సంఘం ఇంచార్జి ఛైర్‌పర్సన్ మనెమోని సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తూరు నారాయణగౌడ్,పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డితో పాటు నాయకులు తోక మురళిధర్‌గౌడ్,శ్రీనివాస్‌రెడ్డి,దళితరత్న బోరింగ్ నర్సింహులు, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్,మేకల సత్యనారాయణ తదితరులు వజ్రోత్సవాల్లో ప్రధాన భూమికను పోషించారు.16న జరిగిన ఏకకాల సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని సీఐ రజితారెడ్డి పర్యవేక్షణలో ఎస్సై భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూత్పూర్ పట్టణ పోలీసులు పకడ్బంధీగా,పటిష్టంగా పట్టణం మంతా మైక్ సౌండ్‌లను ఏర్పాటు చేసి అనౌన్స్‌మెంట్ ఏకకాలంలో పట్టణ ప్రజలతో పాటు విద్యాలయాల విద్యార్థులు, ఉపాధ్యాయులచే సామూహిక జాతీయ గీతాలాపనలు చేయించారు.వజ్రోత్సవాల్లో మూడో రోజు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో భూత్పూర్ జాతీయ రహదారి కూడలి నుంచి అమిస్తాపూర్ వరకు రెండు కిలోమీటర్ల ఫ్రీడమ్‌రన్‌లో ఆరేళ్ల బాలల నుంచి ఎనభైయేళ్ల ముదుసలి వరకు ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్నారు.వజ్రోత్సవాల పక్ష ం రోజుల అనంతరం చివరి రోజు సోమవారం 22న ప్రతి ఇంటిపై రెపరెపలాడిన జాతీయ జెండాలను గౌరవప్రదంగా కిందకు దించి ఎక్కడా జాతీయ జెండాలకు అవమానం కలుగకుండా తీసి ఉంచారు.మొత్తం మీద 75వ స్వాతంత్ర్య వేడుకల వజ్రోత్సవాలను భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో అధికారులు,ప్రజాప్రతినిధులు,ప్రజలు,యువకులు,విద్యార్థులు,ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారనడంలో ఎలాంటి అతిశయోక్తికాదు..



వజ్రోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

### రైతు సంతోషం కోసమే...

## రైతు సంబురాలు

**- దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు అమలు**

**- శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని వృషభ రాజుల బలప్రదర్శన**

**- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే**



వృషభరాజుల బలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల,ఆగస్టు 22 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో గద్వాల మండల పరిధిలో రేపల్లె గ్రామంలో శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని వృషభ రాజుల బలప్రదర్శన (ఎద్దుల బండ లాగుడు) ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారిని దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఎద్దుల బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నడిగడ్డ వృషభ రాజులు బలప్రదర్శన గుర్తింపు తీసుకొచ్చిన స్వర్గీయులు తిరుమల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంతోషం కోసమే రైతు సంబురాలు ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. అన్నదాతల కోసం రైతుబంధు, రైతుభీమా, 24 గంటల కరెంటు, పంటలకు గిట్టుబాటు ధరలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఒకప్పుడు వ్యవసాయం దండగ అనుకునేవారని నేడు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలో తెలంగాణలో పండగలా మారిందన్నారు. రైతుల కోసం రైతు సంబరాలను గతంలో లాగానే బండలాగుడు పోటీలను ఈసంవత్సరం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ సరోజమ్మ, ఎంపిపి ప్రతాప్‌గౌడ్, సర్పంచ్ విజయలక్ష్మి, కెటిదొడ్డి మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు హనుమంతు, తెరాస పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, దామోదర్‌రెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## స్వతంత్ర్య భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలకు భారీగా తరలిన అధికారులు,ప్రజాప్రతినిధులు..



**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:**స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలలో భాగంగా హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో ముగింపు వేడుకలకు భారీగా అధికారులు, ప్రజాప్రతినిధులు తరలి వెళ్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మెన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి సూచించారు. సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి వజ్రోత్సవ ముగింపు వేడుకలకు (4)ఎ.సీ బస్ లను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్ తో కలిసి జిల్లా పరిషత్ చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు ఘనంగా స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల వేడుకలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆగస్టువ తేదీన ఎల్‌బి స్టేడియం, హైదరాబాద్ లో నిర్వహించే వజ్రైత్సవ వేడుకలలో పాల్గొనేందుకు వనపర్తి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌కు భారీగా తరలి వెళ్తున్నట్లు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధికారులు,ఎంపీటీసీలు,జడ్పీటీసీలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## కొత్వాల్ వెంకటరామిరెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

**రెడ్డి జేఏసీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పుచ్చల సుధా రామ్మోహన్‌రెడ్డి**



**కొత్తకోట,ఆగస్టు 22 ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి స్ఫూర్తితో ప్రతి ఒక్కరికి సేవాభావం కలిగి ఉండాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పుచ్చల సుధా రామ్మోహన్ రెడ్డి అన్నారు. రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి సందర్భంగా చౌరస్తాలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ప్రజాప్రతినిధులు మేధావులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు రెడ్డి యువకులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం జోహార్లు పలికారు. ఈ సందర్భంగా పుచ్చల సుధా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కొత్తకోట మండల పరిధిలోని రాయినిపేట గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి హైదరాబాద్ కొత్వాల్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి నిరుపేద విద్యావంతులను చేసిన ఘనత రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి అని ఆమె కొనియాడారు. నేడు కలెక్టర్ గా, కమిషనర్లుగా, ప్రజాప్రతినిధులుగా, రాజకీయవేత్తలుగా ఎదిగిన వారు కొత్వాల్ రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి సహకారం ఎంతో ఉందని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు,రెడ్డి నాయకులు,యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సీఎల్ఆర్ జాతీయ స్థాయి కరాటే గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు అచలపక్ష ఐక్యవేదికి ఘన సన్మానం..



**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** సీఎల్ఆర్ జాతీయ స్థాయి కరాటే లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు అచలపక్ష ఐక్యవేదిక తరుపున ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా అచల పక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఆదివారం జడ్చర్లలో నిర్వహించినటువంటి 9వ సీఎల్ఆర్ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ లో వనపర్తి కి చెందిన గోజురియో కరాటే మరియు కిక్ బాక్సింగ్ అకాడమికి చెందినటువంటి 5 విద్యార్థులు పాల్గొని వారి వారి యొక్క ప్రతిభను కనబరచడం జరిగిందని, దానిలో నాలుగు బంగారు పథకాలు ఒకటి రజతం సాధించిన కొంకలి జయకృష్ణ, కొంకలి కృష్ణ చైతన్య, గోనె రుద్ర, కె.విశాల్, సాయిచంద్ర విద్యార్థులను అచలపక్ష ఐక్యవేదిక తరుపున చంద్రమౌళి, వెంకటేష్, రమేష్, ఆంజనేయులు అడ్వకేట్ లతో కలిసి సతీష్ యాదవ్ సన్మాంచారు. అలాగే బీదవాడు అయిన శేఖర్ తల్లితండ్రులు చిన్నప్పటి నుండి కూలీ పనితో పెంచి ఒక ప్రయోజకునిగా పెంచారని, తాను కష్టపడుతూ వచ్చిన డబ్బులతో కరాటే నేర్పిస్తూ సేవ చేస్తున్న శేఖర్ ను అచలపక్ష ఐక్యవేదిక ఈ సందర్భంగా అభినందిస్తుందని సతీష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ శేఖర్, శివకృష్ణ యాదవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెల్లరాళ్లపల్లి తాండాలో విజేతలకు బహుమతుల ప్రధానం..



**పాన్‌గల్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తాండాలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలు పురస్కరించుకొని గ్రామ స్థాయిలో నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచ్ శాంతమ్మ బహుమతులు అందజేశారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వజ్రోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం సర్పంచ్ శాంతమ్మ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం నిర్వహించిన వజ్రోత్సవాలు 15 రోజులపాటు పండుగ వాతావరణంలో జరుపుకోవడం జరిగిందన్నారు. వజ్రోత్సవాలు విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుజ్జమ్మ, గ్రామ కార్యదర్శి నర్మద, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య నాయక్, గ్రామ సంఘం అధ్యక్షురాలు చిట్టెమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ బాల్యానాయక్, తదితరులు పాల్గొన్నారు

## పంటల వివరాలను నమోదు చేసుకోవాలి..

**వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు**

**శ్రీరంగాపురం,ఆగస్టు 22 ప్రభాతవార్త:**మండలపరిధిలోని నాగరాల రెండవ సెంటర్ మరియు మూడవ సెంటర్ రైతులు ఈవానాకాలం 2022 సంవత్సరం కు సంబందించి సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. పంట వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని సూచించారు. సాగు చేస్తున్న పంటల వివరాలను రైతులు తప్పక నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పక నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు సంబందించి వారి పొలంలో, ఎంత విస్తీర్ణంలో ఏ రకం పంటలను ఏ తేదీల్లో విత్తనం వేశారనే వివరాలను సేకరించామన్నారు. ఇంకా మిగిలిన రైతులు ఎవరైనా ఉంటే మీ పంటల వివరాలను తప్పక నమోదు చేసుకోవాలని ఆయన తెలి పారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..



**జల్లాఘనపురం,ఆగస్టు 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీగణలింగేశ్వర వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ మాస చివరి సోమవారం సందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బజారు ఆంజనేయ స్వామి ఆలయం నుండి వీరభద్రస్వామి ఆలయం వరకు స్వామి వారి ఊరేగింపు జరిపారు. అఖండ బజనల మధ్య వందలాది మంది భక్తులు వెంట రాగ స్వామి వారికి పల్లకి సేవ గావించారు. ఆర్య వైశ్య యువజన సంఘం సభ్యులు స్వామి వారిని స్తోత్రంలో ఖడ్గాలు వేస్తూ ఆనందభరితంగా ఊరేగింపును కొనసాగించారు. అనంతరం ఆలయంలో హోమం, అభిషేకం, అర్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి భక్తి తన్మయత్వం తో మునిగిపోయారు. మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు బాలలింగం, నాగేశ్వర్, నరహరి, పాలవాధి రాజు, అరవింద్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

## నరసింహా స్వామి ఆలయంలో పూజలు..

**జల్లాఘనపురం,ఆగస్టు 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో భక్తులు శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వ ర్యంలో నరసింహస్వామికి అభిషేకాలు చేస్తూ పూజాకార్యక్రమాలు ని ర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు బద్గనీ కు లస్థుల ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. అఖండ బజనలు చే స్తూస్వామి వారికి పల్లకిసేవా తెప్పోత్సవం కార్యక్రమాలను నిర్వ హిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే వీఆర్ఏ లకు పేస్కే లు అమలు చేయాలి..



**పెబ్బేరు,ఆగస్టు 22 ప్రభాతవార్త:** వీఆర్ఏ లకు పేస్కేల్ అమలు చేయాలని గత 29 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం సుభాష్ చౌక్ లో నిర్వహించిన మానవహారం కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ప్రకటించింది. 2 సంవత్సరాలు క్రితం స్వయాన ముఖ్యమంత్రి వీఆర్ఏ లకు గౌరవ వేతనం రద్దు చేసి పేస్కేల్ అమలు చేస్తామని ఇచ్చినహామీ నేటికి నెరవేరలేదని,వారి న్యాయపరమైన డిమాండ్‌లకు కాంగ్రెస్‌పార్టీ సంపూ ర్ణమద్దతు ఇస్తుందని తెలిపారు.అనంతరం వీఆర్ఏలు రాజశేఖర్, భీమేశ్, ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌వర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ నాయకులు రంజిత్ కుమార్, జిల్లా బీసీ సెల్ నాయకులు రాములు యాదవ్, మైనార్టీ నాయకులు షకీల్, మాజీ సర్పంచ్ లు సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, టౌన్ యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు వెంకట్ రాములు, సత్యనారాయణ, నాయకులు బొట్టు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం చేస్తుంది..

**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏ ల నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరుకున్న సందర్భంగా మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. తయ న్యాయమైన డిమాండ్ల సాధనకై వీఆర్ఏ లు చేపట్టిన ఆందోళనకు బీజేపీ జిల్లా పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించి మానవహారం కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ బి.కృష్ణ మాట్లాడుతూ వీఆర్ఏ లు ఆందోళన బాట పట్టి నేటికీ 29 రోజులు గడుస్తున్న న్యాయబద్ధ సమస్యలైనటువంటి పేస్కేల్ జీవో అమలు, విద్యార్హత బట్టి ప్రమోషన్లు మరియు 55 సంవత్సరాల వయస్సు పైబడిన వీఆర్ఏ ల వారసులకు ఉద్యోగాలు కల్పించుట లాంటి మూడు ప్రధాన డిమాండ్‌లతో వీఆర్ఏ లు సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదని, రెవెన్యూ విభాగానికి సంబందించి క్షేత్రస్థాయి లో ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా పని చేస్తున్న వీఆర్ఏ లను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. గతంలో వీఆర్ఏ లు సమస్య పరిష్కారానికి ఆందోళన చేపట్టగా ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వీఆర్ఏ



వీఆర్ఏ ల నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

ల సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇవ్వడం జరిగిందని మరి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఈటల రాజేందర్ గతంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వీఆర్ఏ ల పేస్కే ల్ కు సంబందించి ఆమోదం తెలిపి ఇంత కాలం గడుస్తున్న జీవో విడుదల కాకపోవడం శోచనీయమన్నారు. వీఆర్ఏ ల ఆందోళనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ కుమార్ పూర్తి మద్దతు ప్రకటించడం జనిగిందని రాష్ట్ర పార్టీ సూచనల మేరకే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ వీఆర్ఏ ల ఆందోళనకు సంఘీభావం తెలుపుతుందని తెలియజేశారు. స్థానిక శాసన సభ్యులు, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వీఆర్ఏ ల ఆందోళన ప్రారంభించిన నాలుగో రోజు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏ లను సందర్శించి ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామి ఇచ్చినప్పటికి నెల రోజులు అవుతున్న వ్యవసాయశాఖ మంత్రి నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడం విచారకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో బీజేపీ వీఆర్ఏ ల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణ, ఎ.రామన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు పెద్దిరాజు, సంతోష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బోయేళ్ల రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి సూగూరు రాము, మామిళ్లనల్లి రాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు ఓం ప్రకాశ్ చారి, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గజరాజుల తిరుమలేష్, నందిమల్ల రవి, వెంకటేష్ నాయుడు, బసవన్న, గడ్డ రాము, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వజ్రోత్సవాల ముగింపు సమావేశానికి తరలిన ప్రజాప్రతినిధులు..

**పాన్‌గల్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదిహేను రోజుల పాటు నిర్వహించిన స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు సమావేశానికి సోమవారం పాన్‌గల్ మండల పరిషత్ అధ్యక్షుడు మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మిచంద్రశేఖర్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు మునిరుద్దీన్, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి లు వనపర్తి జిల్లా కేంద్రం నుండి ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నాడు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకునేందుకు గాను దేశానికా స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వజ్రోత్సవాలను 15 రోజులపాటు నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా వజ్రోత్సవాల ముగింపు సమావేశం జరుగుతున్నందున ఆహ్వానం అందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి వెళ్తున్నట్లు తెలిపారు. పాన్‌గల్ మండలంలో వజ్రోత్సవాల విజయవంతానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



వజ్రోత్సవాల ముగింపు సమావేశానికి ప్రత్యేక బస్సులో తరులుతున్న ప్రజాప్రతినిధులు అధికారులు

## పాన్‌గల్ పిహెచ్‌సీ లో తల్లిబిడ్డల మృతిపై విచారణ..

**పాన్‌గల్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** కేతెపల్లి గ్రామానికి చెందిన నిండు గర్బిణీ జ్యోతి ప్రసవ నొప్పులతో బాధపడుతూ కాన్పు కోసం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా సాధారణ కాన్పు జరిగిన సందర్భంలో పుట్టిన బిడ్డతో పాటు తల్లి జ్యోతి మృతి చెందిన సంఘటనపై సోమవారం వనపర్తి మెడికల్ కళాశాల హెచ్ఓడీ డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ కిరణ్మయి లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పునర్విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు సాధారణ కాన్పులో తల్లిబిడ్డల మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కు పూర్తి స్థాయి నివేదికను అందజేస్తామని వారు తెలిపారు. అయితే జ్యోతి ప్రసవ నొప్పులతో ఆసుపత్రికి వచ్చిన సందర్భంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాము ఆసుపత్రిలో లేరని అదే సమయంలో ఆసుపత్రులు సందర్శించేందుకు వచ్చిన ప్రోగ్రాం అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మి కాన్పు చేశారని, కాన్పు చేసిన వారిని కాకుండా ఆసుపత్రిలో లేని డాక్టర్ ను ఎలా సస్పెండ్ చేస్తారని తన కూతురితో పాటు పుట్టిన బిడ్డ ఇద్దరు చనిపోవడానికి కారుకులైన వారిని సస్పెండ్ చేయాలని మృతురాలి తండ్రి బొజ్జయ్య విచారణకు హాజరైన సందర్భంగా విలేక రులతో మాట్లాడారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల హెచ్ఓడీ డాక్టర్ అరుణ కుమారి

## అంటరాని తనాన్ని నిర్మూలిస్తూ పొందుపరచిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి..

**నేడు జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్.. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ మాదిగ**

**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:**నేడు జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజనగరం రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏండ్ల స్వాతంత్ర్యం దళితుల మీద వివక్షతను, అస్పృశ్యతను, అంటరానితనాన్ని తొలగించలేకపోయిందని అన్నారు. ఇందుకు గాను 75 ఏండ్లుగా దేశాన్ని పాలించిన పరిపాలకుల స్వార్థం, కులతత్వం, అసమర్థతనే ప్రధాన కారణమని అన్నారు. కుండలోని నీళ్లు తాగే స్వేచ్ఛ లేని 75 ఏండ్ల స్వాతంత్ర్య ఎవరి కోసం వచ్చినట్లు అని అన్నారు. రాజ్యాంగంలో అంటరానితనాన్ని నిర్మూలిస్తూ పొందుపరిచిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడం వల్లే దళితుల మీద హత్యలు, అత్యాచారాలు అకృత్యాలు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. దళితుల మీద దాడులకు పాల్పడే నిందితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉన్నందుకే స్వేచ్ఛగా హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. బాలుడి హత్యపై ప్రధాన మంత్రి మౌనం వహిస్తూ దళితుల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తున్నాడని అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ప్రసంగంలో దళిత చిన్నారి మృతిని ప్రస్తావించకపోవడం కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. వచ్చే 25 ఏండ్ల భారత ప్రయాణానికి సంబందించి అయిదు అంశాలను ప్రస్తావించిన ప్రధానమంత్రి ఆ 5 అంశాల్లో సామాజిక సమానత్వం కుల నిర్మూలన లేకపోవడం మనువాదానికి నిదర్శనమని అన్నారు. ఇంద్ర కుమార్ మేగ్వాల్ ను హత్య చేసిన వారిని జీవితకాలం జైలులో నిరభందించాలని డిమాండ్ చేశారు. కుల వివక్షత నిర్మూలన కోసం, సాంఘిక సమానత్వం కోసం కేంద్ర ప్రభుత్వ కార్యచరణ ప్రకటించాలని అన్నారు. మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం దళితులకు వ్యతిరేక ప్రభుత్వమని, దళితులు హత్యలకు గురైతే కేంద్ర ప్రభుత్వానికి ఏమి పట్టింపు ఉండదని ఇంద్ర కుమార్ మేగ్వాల్ హత్యతో మరోసారి రుజువు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శివనాయక్, బంజారా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ము చెన్న కేశవులు మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా సీనియర్ నాయకులు మంద నరసింహ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ పరుశురాం మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా నాయకులు దేవని మహేష్ మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు



విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న రాజనగరం రాజేష్‌మాదిగ

## నిషేధిత బెల్లం అమ్మకాలు చేస్తే పీడీ యాక్ట్ అమలు

**-లారీలో భారీగా తరలిస్తున్న బెల్లం పట్టివేత.. కేసు నమోదు -ఎక్సైజ్ సిఐ అనంతయ్య**

**లింగాల,ఆగస్టు22 ప్రభాతవార్త:**నిషేధిత నాటుసారాకు ఉపయోగపడే బెల్లం అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తూ కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ అనంతయ్య హెచ్చరించారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు లింగాలలో సారా తయారీ స్థావరాలపై దాడులు జరిపి పార్వతమ్మ అనే మహిళకు చెందిన 50 లీటర్ల బెల్లం పానకం, ఐదు లీటర్ల సారం, 30 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. లింగాల నుండి చెన్నంపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై ఎక్సైజ్ అధికారులు చేసిన తనిఖీలు అశోక్ లైలాండ్ లారీలో తీసుకుని వస్తున్న 2310 కిలోల బెల్లం 100 కిలోల స్పటికను స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి బెల్లం, స్పటిక తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో దారి కాచి పట్టుకుని లారీతో సహ బెల్లం స్పటికలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జీలుగుపల్లి తండాకు చెందిన కెతావత్ గణేష్ అనే వ్యక్తితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సారా తయారీకి వాడే బెల్లం, స్పటికలను వ్యాపారాలు నిర్వహించిన, సారా తయారు చేసి క్రయ విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రఘునాథరెడ్డి, నాగర్‌కర్నూల్ డిటిఎఫ్ ఎస్సై రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై క్రాంతి, తెల్కపల్లి ఎస్సై జనార్ధన్ పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టుకున్న దృశ్యం

## సుస్థిర వ్యవసాయం ద్వారా అధిక దిగుబడిని సాదిద్దాం

**అచ్చంపేట,ఆగస్టు 22 ప్రభాతవార్త :** అచ్చంపేట మాతృభూమి కార్యాలయంలో సోమవారం అగ్రి కెప్టెన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆరుతడి పంటల పద్దతిలో సుస్థిర వ్యవసాయం ద్వారా అధిక దిగుబడిని సాదిద్దాం అనే నినాదంతో, ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూర్, తెల్కపల్లి మండలాలలో పైలట్ ప్రాజెక్టుగా మాతృభూమి సంస్థ పర్యవేక్షణలో తడి,పొడి వ్యవసాయంపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పై మండలాల నుండి ఎన్నిక చేయబడిన 25 గ్రామాల వాలంటీర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా అగ్రో కెప్టెన్ ప్రాజెక్టు ఇంఛార్జి శేషు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటల ద్వారా వ్యవసాయం చేస్తే రైతులకు అధిక దిగుబడితో పాటు పీడ,చీడల నివారణ ఖర్చులు కూడా తగ్గి పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని, వరి నారుకు నీటి వినియోగంలో పరిణామం సక్రమంగా ఉండడం కోసం ప్లాస్టిక్ పైపు విధానాన్ని ఆచరించాలని తెలిపారు. అంతేకాక ప్రతిరైతు రైతు వివరాలు ఆన్‌లైన్ చేయాలని కోరారు. అదేవిధంగా ప్రయోగాత్మకంగా అచ్చంపేట మండలం లింగోటం గ్రామంలో ప్లాస్టిక్ అమర్చే విధానాన్ని వాలంటీర్లకు చూపించడం జరిగింది. అచ్చంపేట ఏఈఓ లక్ష్మణ్‌సింగ్,స్థానిక వరి నాట్లపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో అల్టిమేట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు శ్రీనివాస్, మాతృభూమి ఫౌండర్ మంజుల, అధ్యక్షులు రమాకాంత్, వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## వీఆర్ఏలు మానవహారంతో నిరసన..



**గోపాల్‌పేట,ఆగస్టు22,ప్రభాతవార్త:**తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు చేపడుతున్న వీఆర్ఏ లు చేపడుతున్న సమ్మెలో భాగంగా సోమవారం 29వ రోజుకు చేరుకుంది.వీఆర్ఏలు తహసిల్దార్ కార్యాలయం నుండి ర్యాలీ గా వెళ్లి బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, కుమార్, బాలరాజు, శివారెడ్డి, శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలు..

**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలలో పాల్గొనేందుకు సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్ఎ రెహమాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు జిల్లా నుండి ఆసక్తి గల సివిల్ సర్వీసెస్ ఉద్యోగస్థులు 23/08/2022 లోపు జిల్లా యువజన, క్రీడల శాఖ డా బాలకిష్టయ్య మిని స్టేడియం గ్రౌండ్ వనపర్తి నందు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ క్రీడల్లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనదలచిన వారు ఉద్యోగుల ఉద్యోగ గుర్తింపు కార్డుతో పాటు ఆధార్ కార్డు, తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 26, 27 అదే విధంగా 20, 30 తేదీలలో జిమ్ ఖాన గ్రౌండ్, ఎల్‌బీ స్టేడియం హైదరాబాద్‌లో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

## వ్యవసాయ భూమిని కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి..



**వనపర్తి క్రైం,ఆగస్టు 22 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో జె.మంగమ్మ భర్త ఆంజనేయులు కు చెందిన 1-04 గుం టల భూమిని దాదాపు 20 సంవత్సరాల క్రితం పి.తిమ్మారెడ్డి తండ్రి పి.రామేశ్వర్ రెడ్డి దగ్గర 1-04 గుంటల భూమిని అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు బాదితురాలు మంగమ్మ పేర్కొన్నారు. నాటి నుండి నేటి వరకు ఇట్టి భూమిని సాగును చేస్తున్న మంగమ్మ పై పట్టా చేయకుండా తిమ్మారెడ్డి భార్య అయిన చంద్రకళ పై పట్టా మార్పిడి చేసి మంగమ్మను అనేక రకాలుగా ఇబ్బం దులకు గురి చేస్తున్నారని ఇచ్చిన పిటీషన్‌లో పేర్కొన్నారు. కానీ నేడు గ్రామ సర్పంచ్ అయిన పి.రవీందర్ తండ్రి పి.రాంచంద్రయ్య అనే వ్యక్తి బాదితురాలి సొంత భూమిని కబ్జా చేయుటకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. ఒంటరి మహిళ అయిన మంగమ్మను అడ్డుకోవడం జరి గిందని పి.రవీందర్ ను తండ్రి పి.రాంచంద్రయ్య అతని అనుచరుడు గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు హరిజన్ బి.ఉషాన్ తండ్రి బి. ఉషాన్ వీరందరు ఒంటరి మహిళ అయిన మంగమ్మపై దాడి చేస్తున్నట్లు తేదీ 1/08/2022 రోజు పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం రోజు జరిగిన ప్రజావాణి లో ఎఎస్పీ షాకీర్ హుస్సేన్ కు మంగమ్మ తనకు పెబ్బేరు పోలీసు స్టేషన్ లో న్యాయం జరగలేదని పైన పేర్కొన్న వారి నుండి ప్రాణహాని ఉందని ఎఎస్పీ షాకీర్ హుస్సేన్ కు పిటీషన్ అందించిన మంగమ్మ న్యాయం చేసి వారినుండిప్రాణాలను కాపాడి వారిపై చట్ట రిత్య చర్యలు తీసుకోవాలని పిటీషన్ లో పేర్కొన్న మంగమ్మ.

## విజయమే లక్ష్యంగా విద్య అభ్యాసం చేయాలి..

**జూనియర్ సివిల్ జడ్జీ రవి కుమార్..**





**వనపర్తి టౌన్,ఆగస్టు 22 ప్రభాతవార్త:** నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని విద్యార్థులు విజయ మే లక్ష్యంగా విద్యాభ్యా సం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి రవి కుమార్ అన్నారు. సోమవారం వనపర్తి పట్టణ సమీపంలో ఉన్న రేడియంట్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా క్రమశిక్షణతో ముందడుగు వేయాలని సూ చించారు. ఏ రంగంలో ప్రవే శించిన ఆ రంగానికి శక్తి వం చనా లేకుండా కృషి చేయా లని ఆయన తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుండి అన్ని రంగాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థ పటిష్టతకు తమ వంతు కృషి అందిచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్ లో ఏ రంగంలో స్థిరపడ్డా నీతీ నిజాయితీ ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన సమాజం నిర్మాణానికి పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందిచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తికి విద్యార్థులు గులాబీ పూలను అందించి ఘన స్వాగతం పలికారు. న్యాయవాదులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉత్తరయ్య, కృష్ణయ్య, శంకర్, ఆంజనేయులు పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల విజయ, ఉపాధ్యాయులు రాము, తిరుమలేష్, శాంతయ్య, భాను, కౌసల్య, కరెస్పాండెంట్, పీఈటీ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న సేవలు ప్రశంసనీయం...

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్‌నాయక్**

**వెల్దండ, ఆగస్టు 22, ప్రభాతవార్త:**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో, తాండాల్లో చేపడుతున్న అభివృద్ధి, సామాజిక సేవలు ప్రశంసనీయమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేందర్‌రెడ్డి చిన్నప్పటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఖండాలు దాటి అమెరికాలో వ్యాపారవేత్తగా ఎదిగి పుట్టిన గడ్డకు సేవ చేయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చి గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఒక్కరు రాఘవేందర్‌రెడ్డికి అండగా నిలువాలన్నారు.

## ఘనంగా బీఎస్పీ నాయకులు బాలవర్ధన్‌గౌడ్ జన్మదిన వేడుకలు

**-కేక్ కట్‌చేసి తినిపించిన పార్టీ నాయకులు**



**రాజాపూర్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బీఎస్పీ జడ్చర్ల నియోజకవర్గ ఇంఛార్జి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, రాజాపూర్ మండల బీఎస్పీ అధ్యక్షులు కాకరజాల యాదగిరి కుమారుడు అద్విక్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ మండల అధ్యక్షులు కాకరజాల యాదగిరి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు ఐకమత్యంతో ఉండి రాబోయే రోజుల్లో బహుజన సమాజ్ పార్టీకి పట్టం కట్టాలని పేర్కొన్నారు. బీఎస్పీ పార్టీ ముఖ్యంగా అక్షరం, ఆర్థికం, ఆరోగ్యంపై పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షులు లీడర్ శ్రీను, ఇంఛార్జి ఆంజనేయులు, రంజిత్, రమని రమేష్, గువ్వల రవి, రాములు, యాదయ్య, నర్సింలు, జంగయ్య, బాలకృష్ణ, శేఖర్, సత్యం, మహేష్, గణేష్, జంగయ్య, శివయాదవ్, రాంచంద్రయ్య, రాములు, విజయ్, మహేష్, అగ్గిరాముడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా ముగింపు వేడుకలు



**చిన్నచింతకుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త :** స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా చిన్నచింతకుంట మండలంలోని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు దేశభక్తి పాటలపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధాన ఉపాధ్యాయులు ఎ. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని వారు కన్న కలలను నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. పోటీలలో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని విద్యార్థులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి గౌడ్, రవిశంకర్, శ్రీనివాసులు, ఎల్లయ్య, పద్మజ అనురాధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాకు భారీగా తరలివెళ్లిన వాల్మీకి బోయలు



**మక్తల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కలెక్టరేట్ ధర్నా కార్యక్రమానికి మక్తల్ నుండి వాల్మీకి బోయలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సోమవారం జిల్లా కేంద్రంలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ధర్నాకోసం మక్తల్ నుండి వాల్మీకి బోయలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. వాహన శ్రేణిని మాజీ ఎంపిపి అధ్యక్షులు గడ్డం పల్లి హనుమంతు ప్రారంభించారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేదాకా పోరాటం కొనసాగిస్తామని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ధర్నాలో తరలివెళ్లిన వారిలో వాల్మీకి బోయ సంక్షేమ సంఘం అధ్యక్షులు, వాల్మీకి బోయ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటి సభ్యులు బోయ రవికుమార్, ప్రధాన కార్యదర్శి చిన్న వెంకటేష్, అనుగొండ సర్పంచ్ గడ్డం రమేష్, అంకెన్‌పల్లి సర్పంచ్ నర్వలక్ష్మణ్, సభ్యులు బి.ఆంజనేయులు, సూర్య, బి. శ్రీనివాసులు, బి.వెంకటమ్మ, బోయ వెంకటేష్, చిన్నకురుమయ్య, చిన్న కొండయ్య, సాయిబాబా, బి.కుర్మయ్య, ఖానాపూర్ వెంకటయ్య ఉన్నారు.

## వాన పాముల ఎరువుల తయారిపై రైతులకు నైపుణ్యత శిక్షణ



**బిజినేపల్లి, ఆగస్టు21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల కేవికేలో సోమవారం రైతులకు వాన పాముల ఎరువుల తయారిపై 3రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా కేవికే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులందరు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నారని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని అన్నారు, కావున రైతులందరు తమ వంతుగా పశువుల ఎరువు పంట వ్యర్థలను ఉపయోగించుకోని వానపాముల సహాయంతో వర్మికంపోస్ట్ ఎరువును తయారు చేసుకోవాలన్నారు, ఈ ఎరువులు అన్ని పంటలలో వాడటం వలన నేలసారం కార్బన్‌శాతం భౌతిక రసాయణ లక్షణాలు మేరుగుపడి పంటల ఉత్పత్తి మరియు ఉత్పాదకాలు మెరుగవుతుందన్నారు, గ్రామంలోని చెత్తను కుడ సమూహాలుగా కుళ్ళింపజేసి సేంద్రీయ ఎరువుగా వాడుకోవచ్చు అన్నారు, ఈ కార్యక్రమంలోఎపిడి శ్రీనివాస్, సుధాకర్, రాజశేఖర్, బి రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గోన్నారు.

## దసరాలోగా నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయం పనులు పూర్తి చేయాలి

**అధికారులకు ఇంఛార్జి మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం**

**నడిగడ్డ, ఆగస్టు 22 ప్రభాతవార్త :** సహజ వనరుల కల్పనకు ప్రజల ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని నివేదికలు పంపాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం హాలులో మినరల్ ఫండ్ ట్రస్ట్ కమిటి (డిఎంఎఫ్‌టి) సమావేశంలో మంత్రి పాల్గొని జిల్లాకు కేటాయించిన రూ. 3 కోట్ల 30 వేల నిధులు జమ కావడం జరిగిందని, ఆ నిధులలో 15 శాతం నిధులు పరిపాలన ఖర్చుల కింద 49,50,000లు పోను మిగతా నిధులలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల అభివృద్ధి పనుల కొరకు ఆయా నియోజక వర్గాలకు కావాల్సిన పనుల వివరాలను ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం నివేదికలు పంపాలని ఆదేశించారు. అవసరాలకు, అత్యవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని, రికార్డు ప్రకారం నిధుల సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. అన్ని మున్సిపాల్టీల పరిధిలో ఎక్కడ ఏఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు అన్ని తెప్పించుకుని అందరు మున్సిపల్ కమిషనర్‌లలో సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌కు ఆదేశించారు. సమావేశంలో జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యేలు డా. అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీహర్ష, సిపిఓ లక్ష్మణ్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**జిల్లా అధ్యక్షులు రామలక్ష్మణ్**

**మహబూబ్‌నగర్ టౌన్ ఆగస్టు 22 ప్రభాతవార్త:**వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటి జిల్లా అధ్యక్షులు రామలక్ష్మణ్ డిమాండ్ చేశారు. వాల్మీకి బోయల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తానుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామలక్ష్మణ్ మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో ఉన్న వాల్మీకులకు గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చకుండా బీసీ జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో ఎస్టీలుగా గుర్తించినప్పటికీ రాష్ట్రంలో మాత్రం బీసీ ఏగా గుర్తించడం వల్ల వాల్మీకి బోయలు అన్నిరంగాలలో వెనుకబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి వాల్మీకులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిగట్ల కృష్ణ, గౌరవధ్యక్షులు యుగేందర్ నాయుడు, నాయకులు వెంకట్రాములు, అంజి, రామకృష్ణ, శివకుమార్, విజయ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

## స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సమావేశం

**తెల్కపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యా వనరుల కేంద్రంలో 75వ స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చంద్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సూచించిన ప్రకారం అన్ని పాఠశాలల్లో ఈనెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు స్వతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిద పోటీలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అన్ని పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అలాగే వచ్చేనెల ఒకటవ తేదీ నుండి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రుడు, స్వతంత్ర భారత వజ్రోత్సవాల మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# లింగాలలో బోనమెత్తిన మహిళలు..!



బోనమెత్తిన మహిళలు పోచమ్మ ఆలయానికి వెళ్తున్న దృశ్యం



పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా తరలివెళుతున్న దృశ్యం



పోతురాజుల విన్యాసాలు

**లింగాల, ఆగస్టు 22 ప్రభాతవార్త :** గ్రామ దేవతల ఆశీస్సులతో పల్లెలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ మండల కేంద్రమైన లింగాలలో బోనమెత్తిన మహిళలు సోమవారం పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి బోనాల పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బంధుమిత్రులు తరలి రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామంలో మహిళలు ఇంటికో బోనం తీశారు. మహిళలు, యువతులు అందంగా అలంకరించిన బోనాల కుండలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జమటిక నాధులు, డప్పు చప్పుళ్ల మధ్య, పోతురాజుల విన్యాసాలు నడుమ శక్తి పూజారి బైండ్ల గిరి ఆధ్వర్యంలో బృందం ప్రదర్శించిన ఆటపాటలు, సాంప్రదాయ నృత్యాలు, మహిళల బొడ్డెమ్మలు, యువకుల కోలాటాలు, భక్తి గీతాల మధ్య ప్రధాన వీధుల గుండా సాగిన బోనాల ఊరేగింపు అందరిని అలరించాయి. వర్షాలు సమృద్ధిగా పాడిపంటలు బాగా పండాలని, గ్రామంలో ఎలాంటి రోగాలు రాకుండా చూడాలని భక్తులు పోచమ్మ అమ్మవారిని వేడుకుంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది పోచమ్మ ఆలయం వద్ద బోనాల పండుగ నాడు మాత్రమే కోళ్లు, యాటల బలిని నిషేధించడంతో భక్తులు బోనం నైవేద్యంగా సమర్పించారు. మంగళవారం వన మహోత్సవం ఉంటుందని, భక్తులు పోచమ్మ ఆలయం వద్ద కోళ్లు, యాటలను బలిఇచ్చి తమ మొక్కులు చెల్లించుకోవచ్చని సర్పంచ్ కోనేటి తిరుపతయ్య తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సర్పంచ్ కోనేటి తిరుపతయ్య చర్యలు తీసుకున్నారు. వేరే ప్రాంతం నుండి ఈ వేడుకల కోసం ప్రత్యేకంగా వచ్చిన పోతురాజు వేషధారణలో కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## కౌకుంట్లలో ఘనంగా యానగుండీ మౌలాలి పీర్ల వేడుకలు

**- పీర్లతో అగ్నిగుండంలో నడిచిన భక్తులు**



కౌకుంట్లలో పీర్లను మొక్కుతున్న సర్పంచ్

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 22:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో ఆదివారం రాత్రి యానగుండీ మౌలాలి మొహర్రం పీర్ల వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ వేడుకలను గ్రామస్థులు ఐక్యమత్యంగా జరుపుకొంటారు. అందుతో భాగంగానే ఈ వేడుకలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కుబడి గల భక్తులు పీర్లకు వెండి ఆభరణాలను సమర్పించుకొన్నారు. మాలీదలు చేసి ఫాతెహాలతో నైవేధ్యాలు సమర్పించారు. కొంత మంది భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ భక్తిని చాటుకొన్నారు. అలైబలై ఆడారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. దీంతో పీర్ల మసీదు ప్రాంతం ఒక్కసారిగి సందడిగా మారింది. వేడుకల సందర్భంగా పీర్లను వివిధ రకరకాల వెండి ఆభరణాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తప్పెట్లు,తాళాల మధ్య పీర్ల ఊరేగింపు గ్రామంలో హోరెత్తిపోయింది. గ్రామంలో పీర్ల ఊరేగింపుకు అడగడుగున ఘనంగా స్వాగతం పలికారు. పీర్లు వచ్చే మార్గంలో నిండుకుండ నీళ్ళు చల్లి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**వేడుకల్లో సర్పంచ్....** దేవరకద్ర మండలం కౌకుంట్లలో ఆదివారం రాత్రి జరిగిన యానగుండీ మౌలాలి మొహర్రం పీర్ల వేడుకలలో సర్పంచ్ స్వప్నకిషన్‌రావు పాల్గొన్నారు. పీర్లపై దట్టీలు కప్పి తమ మొక్కులు తీర్చుకొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ంలో వార్డు సభ్యుడు నరేష్, రవీందర్‌రెడ్డి, యలమనాగు, గోపాల్‌గౌడ్, ఫజల్‌రహిమాన్, బురాన్‌సాబ్, జానిమియ, ఖలీల్‌లతో పాటు యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

**- లయన్స్‌క్లబ్ పాస్ట్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు**



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు 22, ప్రభాతవార్త:**లయన్స్‌క్లబ్ ఫాస్ట్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆమనగల్లు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో శిశుమందిర్‌లోని విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని రీజియన్ చైర్మన్ బావండ్ల వెంకటేష్, క్లబ్ అధ్యక్షులు భైరి కరుణాకర్‌రెడ్డిలతో కలిసి మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో లయన్స్‌క్లబ్ వారు నిర్వహించే ఉచిత కంటి, దంత పరీక్షల క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శిబిరంలో కంటి వైద్యులు వీరమల్ల వెంకటస్వామి, బావండ్ల వెంకటేష్‌లు 150 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారికి దృశ్య లోపం ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు భైరి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా యెన్నం ఆసుపత్రి బృందం ఫర్హానా బేగం దంత పరీక్షలు నిర్వహించి దంతాల నొప్పితో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీ.వెంకట్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా, శిశుమందిర్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి:తహసిల్దార్



బహుమతి అందుకున్న బండర్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు



సిసికుంట జిల్లా లెవల్ బహుమతి అందుకున్న విద్యార్థులు

**చిన్నచింతకుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త :** వజ్రోత్సవాలను పురస్కరించుకుని మండల స్థాయిలో నిర్వహించిన ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలలో బండర్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్ పోటీలలో మండలస్థాయిలో విజేతలు నిలిచారు. అదేవిధంగా చిన్నచింతకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కబడ్డి పోటీలలో జిల్లా లెవల్ విజేతలు విజయం సాధించారు. వారికి తహసిల్దార్ జె.సువర్ణరాజ్, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతోపాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎం రామలింగం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, ముక్తార్ అహ్మద్, కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, విద్యార్థులు, బాలికలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గడీల పాలనకు ప్రజలే చరమగీతం పాడాలి..

## వైఎస్ఆర్ టీపీ అధికారంలోకి వైఎస్ఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం..

**ప్రజా ప్రస్తాన పాదయాత్రలో వైఎస్ఆర్ టీపీ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల..**

**అమరచింత, ఆగస్టు 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయని గడీల పాలనకు ప్రజలే చరమగీతం పాడాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలను కోరారు. సోమవారం అమరచింత మండలంలోని మిట్టనందిమల్ల, ఈర్లదిన్నె, కృష్ణంపల్లి, జూరాల ప్రాజెక్టు వరకు ప్రజా ప్రస్తాన పాదయాత్ర కొనసాగింది. పాదయాత్ర రహదారిలో వృద్దులను, మహిళలను, యువకులను, వ్యవసాయ కూలీలలను ఆప్యాయంగా పలకరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. అనంతరం ప్రియదర్శిని ఎక్స్ రోడ్డులో మహిళలు భారీ ఎత్తున మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలన సాగుతున్న రాష్ట్రంలో ఉద్యోగాలు, పెంచన్లు, ఉపాధి, డబుల్ బెడ్ ఇస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి హయంలో రాష్ట్రంలో 46 లక్షల ఇండ్లు ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కిందని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ 3 లక్షల ఇండ్లైన ఇచ్చాడా అని ఆమె ప్రశ్నించారు. అలాగే వైఎస్ హయంలో రైతులకు ఒకే సారి రుణమాఫి చేసి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని విద్యార్థులకు ఉన్నత చదువులకు ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేసిన ఘనత వైఎస్ కే దక్కిందని ఆమె అన్నారు. రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నా ఉద్యోగాలు నిరుద్యోగ బృతి, పెంచన్లు ఇవ్వండలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫి, ఉచిత విద్యుత్, ఉద్యోగాలు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకులు నరసింహారెడ్డి, కర్ని గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి పోరుబాట : సీపీఐ రాష్ట్రనాయకులు పరమేష్ గౌడ్

**మహబూబ్‌నగర్ టౌన్ , ఆగస్టు, 22, ప్రభాతవార్త:**మహబూబ్‌నగర్ జిల్లా సమగ్రాభివృద్ధికి పోరుబాట చేపట్టనున్నామని సీపీఐ రాష్ట్ర నాయకులు బీ. పరమేష్ గౌడ్ అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ జిల్లా నూతన కార్యవర్గం కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి విషయంలో పాలకులు దశాబ్దాల తరబడి వివక్షత, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పాలకుల విధానాల ఫలితంగానే నిత్యం వెనుకబడ్డ జిల్లాగానే మిగిలి పోతుందన్నారు. జిల్లాలో సారవంతమైన నేలలు, నైపుణ్యత కల్గిన యువత, చెమటోడ్చి శ్రమించేకార్మికులున్నా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించకుంటే ఆందోళన చేస్తామన్నారు. అనంతరం జిల్లా మహసభల్లో తీసుకున్న తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించారు. సమావేశంలో నూతనంగాఎన్నికైన సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, సహాయ కార్యదర్శి మాకం రామ్మోహన్, సభ్యులు సురేష్, బి.కృష్ణయ్యయాదవ్, అల్వాల్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**వెల్దండ, ఆగస్టు 22, ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో బాణావత్ పాండు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి మృతుని భార్య భారతికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, వార్డు సభ్యులు భుజంగం, శ్రీనునాయక్, తారాసింగ్, శ్రీధర్, రాజ, సుమన్, చిరంజీవి, లక్ష్మీపతి, బాలు తదితరులు ఉన్నారు.

## వజ్రోత్సవ ముగింపు వేడుకలకు తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు, అధికారుల యంత్రాంగం

**నారాయణపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త :** సోమవారం హైద్రాబాద్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన వజ్రోత్సవ ముగింపు వేడుకలకు నారాయణపేట జిల్లా నుండి జడ్పీటిసిలు, ఎంపిపిలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్పీఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు తరలివెళ్లారు. ఉదయం 9 గం.లకు మిని స్టేడియం నుండి మూడు బస్సుల్లో తరలివెళ్లారు. ఆర్డీఓ రాంచందర్ నాయక్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

## పాఠశాలలో ఘనంగా వజ్రోత్సవ వేడుకల ముగింపు

**ఉట్కూర్, ఆగస్టు22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ ఆదేశానుసారం గతపక్షం రోజులుగా నిర్వహిస్తున్న 75వ స్వతంత్ర వజ్రోత్సవవేడుకల్లో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గత కొన్ని రోజులుగా నిర్వహించిన వివిధ రకాల ఆటలు, పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మనమందరం వజ్రోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం కావడం ఈ జన్మకు లభించిన గొప్ప అవకాశంగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సలాం, లియాఖత్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వజ్రోత్సవ ముగింపు వేడుకలకు బయలుదేరి వెళ్లిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**గద్వాల, ఆగస్టు 22 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రందలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా ముగింపు వేడుకలకు మూడు ఆర్టీసి బస్సులలో జిల్లా నుండి ప్రజాప్రతినిధులు, అధికారులు తరలివెళ్లారు. వారు బయలుదేరిన మూడు బస్సులను వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీహర్ష, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు మరోక అవకాశం కల్పించాలి

**మహబూబ్‌నగర్ టౌన్ ఆగస్టు 22 ప్రభాతవార్త:**317 జిఓ వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు మరోసారి అవకాశం కల్పించాలని పీఆర్‌టీయు తెలంగాణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుంకుడు శ్రీనివాస్, మరికంటి బాల్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల ఉపాధ్యాయులు చదువుకున్న స్వంతజిల్లా కాకుండా ఇతరజిల్లాలకు కెటాయిం చబడటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందుల పాలువుతున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన స్థానికత్వం ఆధారంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## వజ్రోత్సవ ముగింపు వేడుకలకు బయలుదేరిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు22 ప్రభాతవార్త:**హైద్రాబాద్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో పాల్గొనడానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుండి జడ్పీటిసిలు, ఎంపిపిలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్పీఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు సోమవారం ఉదయం 9 గం.లకు కలెక్టరేట్ నుండి 5 బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

## ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



**రాజాపూర్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం రాఘవపూర్ గ్రామ ఉపసర్పంచ్ భర్త, అభిమన్యు యువసేన నాయకులు రాఘవాపూర్ చిరంజీవి జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి నర్సింలు, యువ నాయకులు అభిమన్యురెడ్డి సమక్షంలో రాజాపూర్ మండల కేంద్రంలో కేక్ కట్‌చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణానాయక్, వెంకటయ్యగౌడ్, చొక్కంపేట వెంకటేష్, టిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బంగారు వెంకటేష్, నజీమ్‌బేగ్, చొక్కంపేట మల్లేష్, మొగిలి మహిపాల్, సురేష్, తోపు శ్రీనివాస్‌లతో పాటు టిఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమన్యు యువసేన నాయకులు పాల్గొన్నారు.